నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కర్నూలు కలెక్టరేట్‌లోని సోమవారం సునయన ఆడిటోరియంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. జిల్లా కేంద్రం తో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపాలిటీ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని అన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.



ఆదోని మార్కెట్ యార్డుకు విక్రయానికి వచ్చిన పత్తి

నిబంధనాల్లో పత్తి రైతు

- ఎండమావిగా సీసీఐ మద్దతు ధర
- ఒక రైతు నుంచి ఎకరాకు 5 క్వింటాళ్లే కొనుగోలు
- తేమ ఉందంటూ మరో కొర్రి
- ఇప్పటికి కొన్నది 2400 క్వింటాళ్లే
- అడ్డగోలు నిబంధనలతో పత్తి రైతు అవస్థలు
- తక్కువ ధరకే అమ్ముకొని నష్టపోతున్న రైతులు

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పత్తి ధర మరింత పతనమయింది. మార్కెట్ యార్డ్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర కంటే క్వింటం పత్తి రూ.600 తక్కువకు వ్యాపారులు కొంటున్నారు. ఇలాంటి సమయంలో రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం రంగ సంస్థ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) నిబంధనల పేరుతో కాలయాపన చేస్తున్నది. ఎకరాకు మొదటి కోత 5 క్వింటాళ్లకు మించి కొనలేమని కరాఖండిగా చెప్పి వెనక్కి పంపిస్తున్నారు. మరోవైపు పత్తిలో తేమ ఉందని పేచి పెడుతున్నారు. నిబంధనల సుడిగుండంలో రైతులు పత్తి అమ్ముకోడానికి అవస్థ పడుతున్నారు. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ, సీసీఐ సమన్వయ లోపం పత్తి రైతులకు శాపంగా మారింది. పత్తి విక్రయించుకోవడానికి వందల సంఖ్యలో పేర్లు నమోదు చేసుకున్న రైతులు కేంద్రాలకు వస్తే నిబంధనలతో తిరస్కరిస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది 2.15 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారు. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురవడంతో ఎకరాకు 12-15 క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చింది. దిగుబడి ఆశించిన స్థాయిలో ఉండడంతో రైతులు సంబరపడ్డారు. అంతలోనే పత్తి ధరలు పతనం కావడంతో కనీసం పెట్టుబడి ఖర్చులు కూడా రాలేని పరిస్థితి. మద్దతు ధర కంటే తక్కువగా మార్కెట్ కమిటీలో పత్తిని వ్యాపారులు కొనుగోలు చేస్తుండడంతో ప్రభుత్వం, మార్కెటింగ్ శాఖ అప్రమత్తమై సీసీఐను రంగంలోకి దించింది. కనీస మద్దతు ధర క్వింటం రూ.7521తో ఆదుకుంటుందని రైతులు ఆశించారు. పత్తి పంట సాగుకు పెట్టిన పెట్టుబడి ఖర్చులు వస్తాయి. లాభాలు లేకపోయినా అప్పులు తీర్చుకోవచ్చని అనుకున్నారు. కొనుగోలు చేస్తామని సీసీఐ ప్రకటించడంతో రైతు సేవా కేంద్రాలలో నమోదు చేసుకున్నారు. తీరా కొనుగోలు కేంద్రాలకు పండించిన పత్తిని రైతులు తీసుకొస్తే నిబంధనల పేరుతో తిరస్కరిస్తున్నారు. దీపావళి కంటే ముందే ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, పెంచికలపాడులలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా, రైతుల నుంచి కొనుగోలుకు మాత్రం 5 రోజులు కిందే మొదలు పెట్టారు. . ఇప్పటివరకు 144 మంది రైతులు నుంచి కేవలం 2400 క్వింటాళ్లే పత్తిని కొనుగోలు చేసినట్టు సీసీఐ అధికారులు తెలుపుతున్నారు.



తేమశాతాన్ని మిషన్ ద్వారా పరిశీలిస్తున్న సీసీఐ సిబ్బంది

మార్కెట్లో రోజుకు పదివేల క్వింటాళ్లు

ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో ప్రతిరోజు 10వేల నుంచి 12వేల క్వింటాళ్ల పత్తిని వ్యాపారులు కొంటున్నారు. పత్తిధర గరిష్ఠంగా రూ.7100 మించి వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. తక్కువ ధరకే ఇన్ని వేల క్వింటాళ్ల వేల మంది రైతులు విక్రయిస్తున్న సీసీఐ నిబంధనల వల్ల మద్దతు ధరకు అమ్ముకోలేక తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని ఆదోని, కౌతాలం, పెద్దకడుబురు, హాలహర్వి, ఆలూరు, చిప్పగిరి, మంత్రాలయం, గోనెగండ్ల, ఎమ్మిగనూరు, ప్రాంతాల్లో ఎకరాకు 12-14 క్వింటాళ్లపైగానే దిగుబడి వచ్చింది. కౌతాళం మండలం ఉప్పరహాల్ గ్రామంలో ఎకరాకు 16నుంచి 18 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని రైతులు చెబుతున్నారు. దిగుబడి అధిక మొత్తంలో వచ్చినా వ్యవసాయ శాఖ మాత్రం కేవలం ఎనిమిది క్వింటాళ్లకు దిగుబడి మించలేదని నివేదిక పంపడంతో సీసీఐకి విక్రయించుకునేందుకు కేవలం ఎనిమిది క్వింటాళ్లేనని నిబంధనలు పెట్టింది. దీంతో పత్తి రైతులు అమ్ముకోలేక అవస్థలు పడాల్సిన పరిస్థితి. అమ్ముకునేందుకు కూడా పత్తి రైతులు ఆసక్తి చూపడం లేదు.

మిగతా 7లో..

శ్రీగిరిపై కార్తీక కాంతులు

- భక్తులతో కిటకిటలాడిన శ్రీశైల క్షేత్రం
- నేడు లక్ష దీపోత్సవం, పుష్కరిణికి దశవిధ హారతులు

శ్రీశైలం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో కార్తీక మాసోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. కార్తీకమాసం పురస్కరించుకుని ఆదివారం క్షేత్రానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. దీంతో క్షేత్ర పురవీధులన్నీ భక్తులతో రద్దీగా దర్శనమిచ్చాయి. వేకువజాము నుంచే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామిఅమ్మవార్ల దర్శనానికి క్యూలైన్లలో బారులుదీరారు. భక్తుల రద్దీ దృష్ట్యా శని, ఆది, సోమవారాల్లో స్వామివారి అలంకరణ దర్శనం మాత్రమే కల్పిస్తున్నారు. ఉదయం నుంచే భక్తులు ఆలయ ఉత్తర మాడవీధి ప్రాంగణం వద్ద, దేవాలయం ఎదురుగా ఉన్న గంగాధర మండపం వద్ద విశేష పూజలు నిర్వహించుకుని దీపారాధనలు చేశారు. దేవస్థానం అధికారులు క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు తాగునీరు, బిస్కెట్లు, అల్పాహారం అందజేశారు. దర్శనానంతరం భక్తులకు అన్నదాన భవనంలో అన్నప్రసాద వితరణ అందజేస్తున్నారు. సాయంత్రం ఆలయ ధ్వజస్తంభం వద్ద శాస్త్రోక్తంగా ఆకాశ దీపం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఆకాశదీప ప్రజ్వలనకు ముందుగా అర్చకులు సంకల్పాన్ని పఠించారు. అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని గణపతి పూజ నిర్వహించి, దీపప్రజ్వలన, దీపారాధనలు నిర్వహించారు. కార్తీక మాసోత్సవాల సందర్భంగా దేవస్థానంలో అఖండ శివ భజన కార్యక్రమాన్ని కొనసాగిస్తోంది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా సదుపాయాలను కల్పించేందుకు దేవస్థానం కార్యాలయం సిబ్బందికి ప్రత్యేక విధులను కేటాయించారు.



పూజలు చేస్తున్న భక్తులు

నేడు లక్ష దీపోత్సవం, పుష్కరిణికి దశవిధ హారతులు

కార్తీకమాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకొని సాయంత్రం ఆలయ పుష్కరిణి వద్ద లక్ష దీపోత్సవం, పుష్కరిణి హారతి నిర్వహించనుంది. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు విశేషంగా పూజాదికాలు జరిపి అనంతరం పుష్కరిణికి దశ విధ హారతులు సమర్పించనున్నారు. లక్ష దీపోత్సవం సందర్భంగా పుష్కరిణి ప్రాంగణమంతా దీపాలను ఏర్పాటు చేయనున్నారు.



దర్శనానికి కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్న భక్తులు

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ఆధార్ తప్పనిసరి

ఎస్పీ బిందుమాధవ్

కర్నూలు క్రైం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఫిర్యాదుదారులు తమ ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని ఎస్పీ బిందుమాధవ్ ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు టూ టౌన్ పోలీసు స్టేషన్, కొత్తపేట దగ్గర గల కార్యాలయంలో ప్రతి సోమవారం ఈ కార్యక్రమం జరుగుతుందని అన్నారు.

శైవ క్షేత్రాల్లో ప్రధాన న్యాయాధికారి పూజలు

బండిఆత్మకూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన శైవ క్షేత్రాల్లో కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ది, ఆయన సతీమణి గాయత్రి, ప్రధాన సీనియర్ సివిల్ న్యాయాధికారి మల్లీశ్వరి పూజలు నిర్వహించారు. మండలంలోని ఓంకారం, శివనంది క్షేత్రాల్లో ఆదివారం న్యాయమూర్తులకు ఈవో నాగప్రసాద్ అర్చకులతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం వారు ఆయా క్షేత్రాల్లో గంగా ఉమా సమేత సిద్ధేశ్వర, శివనందీశ్వర స్వామివార్లకు పూజలు చేశారు. అలాగే కృష్ణనంది క్షేత్రంలో స్వామివార్లను న్యాయాధికారి దంపతులు పూజలు చేశారు.



కృష్ణనందిలో పూజలు చేస్తున్న ప్రధాన న్యాయాధికారి కబర్ది దంపతులు

మట్టి మాఫియా

- పేదల పట్టా భూముల్లో తవ్వకాలు
- కుందూ నది పక్కనే భారీ యంత్రంతో పనులు
- చీకటి పడగానే ట్రాక్టర్లతో తరలింపు
- ఏడడుగుల మేర గుంతలు

నంద్యాల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలో మట్టి దొంగలు రెచ్చిపోతున్నారు. నందమూరి నగర్ టిడ్కో ఇళ్ల వెనుక కుందూ నది ఒడ్డున భారీ యంత్రాలతో తవ్వకాలు జరిపి మట్టి కొల్లగొడుతున్నారు. చీకటి పడగానే ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా మట్టిని తరలించుకపోయి సొమ్ము చేసుకుంటున్నారు. అనుమతులు ఉన్నాయా? లేదా? అనే సంగతి పక్కనపెడితే, ప్రభుత్వం పేదలకు పట్టాలు ఇచ్చిన భూముల్లో అక్రమార్కులు మట్టి తవ్వడం విస్మయం కలిగిస్తోంది. వీరి తీరు వల్ల పేదలు భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి రావటమే కాకుండా, ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లుతోంది. ఈ స్థాయిలో మట్టి తవ్వకాలు జరుపుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.




నందమూరి నగర్ టిడ్కో ఇళ్ల వెనుక పేదల పట్టాల ప్రాంతంలో మట్టి తవ్వుతున్న దృశ్యం



పేదలకు కేటాయించిన పట్టాల సరిహద్దును చూపే రాళ్లు

నందమూరి నగర్ టిడ్కో ఇళ్ల వెనుక కుందూ నది వెంట దాదాపు ఆరువేల మంది పేదలకు పట్టాలు ఉన్నట్లు సమాచారం. పట్టాలు తీసుకున్నారేగాని పేదరికం వల్ల ఇళ్ళు కట్టుకోలేదు. ఈ ప్రాంతమంతా పూర్తిగా పిచ్చి మొక్కలు మొలవటంతో ఇక్కడ ఇండ్ల స్థలాలు ఉన్నాయని గుర్తు పట్టేలా పరిస్థితి లేదు. పైగా నందమూరి నగర్‌కు వెళ్లే దారికి కాస్త పెడగా ఉండటంతో ఈ ప్రాంతం ఊరికి చివర్లో ఉన్నట్లనిపిస్తుంది. ఇదే అదనుగా కొంతమంది ఇక్కడ మట్టిని తవ్వి కళ్లు గప్పి తరలించుకపోతున్నారు. పది దాటగానే ఈ ప్రాంతమంతా నిర్మానుష్యంగా మారుతోంది. అపుడు ట్రాక్టర్లు, టిప్పర్లతో మట్టి తరలిస్తున్నారు. ఇప్పటికే దాదాపు 200 ట్రాక్టర్ల మట్టిని తరలించినట్లు తెలుస్తోంది. పేదల స్థలాలను గుర్తించే సరిహద్దు రాళ్లను తొలగించి భారీ యంత్రాలతో తవ్వుతున్నారు. ప్రాంతంలో ఇప్పటికే ఏడడుగుల మేర భారీ గోతులు ఏర్పడ్డాయి. ఇక్కడ ఎంత తవ్వినా అడిగేవారు లేరు కాబట్టి వేల క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వుకుని కోట్ల రూపాయలు జేబులో వేసుకోవచ్చన్నది అక్రమార్కులు పన్నాగం. దీనిని బట్టి మట్టి మాఫియా నంద్యాలలో ఎలా రెచ్చిపోతోందో అర్థమవుతోంది. ఈ తవ్వకాలను ఆపకపోతే పట్టాలు అందుకున్న వేల మంది పేదలు అన్యాయమైపోతారు. ఆఖరుకి తమ భూములు ఎక్కడ ఉన్నాయో గుర్తించలేని పరిస్థితి ఏర్పడుతుంది. ప్రభుత్వ యంత్రాంగం సర్వే చేసి అసలు అక్కడ ఎవరి భూమి ఎక్కడ ఉన్నదీ నిగ్గుదేల్చడం కష్టమైపోతుంది. ప్రజా సంఘాల నాయకులు లేదా ఇతరులు ఎవరైనా పేదల భూములు చూపెట్టమని కోర్టుకు ఎక్కితే చివరకు చిక్కుల్లో పడేది అధికార యంత్రాంగమే అనే విమర్శలు వస్తున్నాయి.



పేదలకు పట్టాలు ఇచ్చిన ప్రాంతం ఇదే

మిగతా 7లో..

నదీ ప్రవాహాన్ని మార్చేలా..

ప్రస్తుతం అక్రమార్కులు మట్టిని తవ్వే ప్రాంతం కుందూ నదికి పది అడుగుల దూరలో ఉన్నది. కుందూనదికి సంబంధించి నందిపల్లె నుంచి వచ్చే ఒక పాయ, సంతజూటూరు నుంచి వచ్చే మరో పాయ ఈ ప్రాంతంలోనే కలుస్తాయి. అక్రమార్కులు చేసిన పనికి భవిష్యత్తులో కుందూ నదికి ప్రవాహం ఎక్కువ వచ్చి సరిహద్దుగా ఉన్న కాస్త మట్టి కట్ట తెగితే నీరంతా ఈ గుంతల్లో నిండిపోతుంది. ఇది ఇలాగే కొనసాగితే కుందూ ప్రవాహం మారి టిడ్కో ఇళ్ల వైపు చొచ్చుకుని వచ్చే ప్రమాదం ఉందని, దీనివల్ల ప్రజలు నష్టపోతారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ధన దాహంతో వేల మంది ఇబ్బందుల్లో పడేలా అక్రమ దందాలు చేస్తున్నా వాటిని అడ్డుకట్ట వేయటంలో జిల్లా యంత్రాంగం నిర్లక్ష్యం కనిపిస్తోంది.

విద్యుత్ ప్రమాదంలో ఇద్దరి మృతి



నాగూర్ బాషా, రాఘవేంద్ర మృతదేహాలు

మహానంది, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కూలీపని కోసం అరటి కాయలు మోసేందుకు వెళ్ళి అక్కడ జరిగిన విద్యుత్ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటన ఆదివారం మహానంది మండలం అబ్బీపురంలో చోటు చేసుకొంది. మండలంలోని అబ్బీపురం గ్రామానికి చెందిన షేక్ నాగూర్ బాషా(43), కర్నూలు జిల్లా మద్దికెర మండలం పెరవలికి చెందిన బోయ రాఘవేంద్ర(46) ఆదివారం మరి కొందరు కూలీలతో కలసి మండలంలోని కృష్ణనంది సమీపంలోని అరటి గెలలను కోసేందుకు మినీ లారీలో వెళ్లారు. రాఘవేంద్ర మినీ లారీకి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గెలలను కోసి లారీలో లోడ్ చేశాక, మిగతా కూలీలు లారీ వెంట నడిచి రాగా నాగూర్‌బాషా లారీ డ్రైవింగ్ చేస్తుండగా రాఘవేంద్ర వాహనంలో బయల్దేరాడు. అబ్బీపురానికి కిలో మీటర్ దూరంలోని ఐదు మాన్ల చెట్ల రహదారిలో 11 కెవి విద్యుత్ కేబుల్ తగలడంతో లారీ ప్రమాదానికి గురైంది. డ్రైవర్ రాఘవేంద్ర, నాగూర్‌బాషా అక్కడికక్కడే మృతి చెందారు. మిగతా కూలీలు సంఘటన స్థలానికి చేరుకొని స్థానికులకు సమాచారం అందించారు. మండల ట్రాన్స్‌కో ఏఈ ప్రభాకర్‌రెడ్డి సంఘటన స్థలా నికి చేరుకొని సిబ్బంది ద్వారా వివరాలను సేకరించారు. మహానంది పోలీసులకు ఫిర్యాదు చేసారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.



ప్రమాదానికి గురైన మినీ లారీ



పులిరాజు ప్రాభవం

ఆత్మకూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ సూచికలో పెద్దపులికి ప్రాధాన్యత ఉంది. పలు దేశాలు పెద్దపులిని తమ జాతీయ జంతువుగా ప్రకటించుకున్నాయి. ఇందులో భాగంగానే సైబీరియన్ జాతిలోని ఫాన్థెరటైగ్రీస్ కుటుంబానికి చెందిన పెద్దపులిని మన దేశం జాతీయ జంతువుగా ఎంచుకుంది. 1972 నవంబరు 18వ తేదీన పెద్దపులిని జాతీయ జంతువుగా భారత ప్రభుత్వం స్వీకరించింది. ప్రపంచంలోనే అత్యంత వేగంగా ప్రయాణించే జంతువుగా పేరుగాంచిన పెద్దపులి ప్రాముఖ్యతపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

- దేశానికే తలమానికం నాగార్జున సాగర్-శ్రీశైలం టైగర్ ప్రాజెక్ట్
- జాతీయ జంతువుగా గుర్తింపు వచ్చి 52 వసంతాలు
- నేడు పెద్దపులిని భారత ప్రభుత్వం జాతీయ జంతువుగా స్వీకరించిన దినం..

ప్రపంచంలో సుమారు 8జాతులకు చెందిన పెద్దపులులు ఉన్నట్లు గుర్తించారు. అందులో బెంగాల్‌టైగర్, ఇండోచైనీస్ టైగర్, మలయన్ టైగర్, సుమత్రన్ టైగర్, సైబీరియన్ టైగర్, సౌత్‌చైనా జాతులకు చెందిన టైగర్లు ఉండగా బాలినీస్ టైగర్, జావన్‌టైగర్లు అంతరించిపోయినట్లు జంతు పరిశోధకులు గుర్తించారు. కాగా బెంగాల్ టైగర్‌ను మన జాతీయ జంతువుగా ప్రభుత్వం 1972 నవంబర్ 18వ తేదిన ప్రకటించింది.

పెద్దపులికి ప్రపంచంలో ఉండే ప్రాముఖ్యత

మనదేశం 1972 నవంబర్ 18వ తేదిన పెద్దపులిని జాతీయ జంతువుగా ప్రకటించి వాటి సంరక్షణ కోసం ప్రత్యేక చట్టాలను ఏర్పాటు చేసింది. ఇంతటి విశిష్టత కలిగిన పెద్దపులి అవయవాలకు బహిరంగ మార్కెట్‌లో మంచి గిరాకీ వుందని చెప్పవచ్చు. విదేశీ మార్కెట్‌లో పులి చర్మం కనీస ధర రూ.20 లక్షల పైబడి పలుకుతున్నట్లు తెలుస్తోంది.



దేశానికే తలమానికం నల్లమల

నల్లమలలో విస్తరించిన నాగార్జునసాగర్-శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం పులుల సంరక్షణలో దేశానికే తలమానికంగా నిలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల, ప్రకాశం, పల్నాడు జిల్లాల పరిధిలో 3727.82 చ.కి.మీల పరిధిలో విస్తరించి దేశంలోనే అతిపెద్ద టైగర్ రిజర్వు ఫారెస్ట్‌గా గుర్తింపు దక్కించుకుంది. ఇందులో 2444 చ.కి.మీల కోర్ ఏరియా ఉండగా, 1283.82 కిమీల బఫర్ ఏరియా గుర్తించారు. కాగా ఎన్ఎస్‌టీఆర్‌లో 2014-15లో 37పెద్దపులుల ఉండగా ప్రస్తుత గణాంకాల ప్రకారం 2023-24లో ఎన్ఎస్‌టీఆర్‌లో 87 పెద్దపులులు ఉన్నట్లు అంచనా. మొత్తంగా పులికూనలతో కలిపి వందకుపైగానే ఉన్నట్లు తెలుస్తోంది. గత ఏడాది మార్చి నెలలో ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని ముసలిమడుగు సెక్షన్‌లోని పెద్దగుమ్మడాపురం గ్రామ సమీపంలో ఓ పెద్దపులి నాలుగు ఆడపులి కూనలకు జన్మనిచ్చింది. అయితే తల్లిపులి నుంచి పులికూనలు దూరమైనప్పటికీ ఒకే ఈతలో ఏకంగా నాలుగు పులి కూనలకు జన్మనివ్వడం దేశవ్యాప్తంగా సంచనంగా మారింది. తల్లినుంచి దూరమైన పులికూనలను అటవీ అధికారులు ప్రస్తుతం తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర జూపార్క్‌లో సంరక్షిస్తున్నారు. వాటిలో ఒక పులికూన మరణించగా, మిగినవి సురక్షితంగా ఉన్నాయి. రెండేళ్ల తర్వాత వాటిని తిరిగి నల్లమల అడవిలోనే వదిలేస్తామని అటవీ అధికారులు చెబుతున్నారు.


కూనలతో పెద్దపులి

పర్యావరణ పరిరక్షణలో పెద్దపులి మనుగడే కీలకం



పర్యావరణ పరిరక్షణలో పెద్దపులి మనుగడ ఎంతో కీలకం. పులి ఆవాసాన్ని ఏర్పాటు చేసుకున్న ప్రాంతంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పర్యావరణం సమతౌల్యంగా వుంటుంది. పులుల రక్షణకై అటవీశాఖ ఎంతో కృషి చేస్తోంది. ప్రత్యేకించి పులుల ప్రత్యుత్పత్తి కోసం అడవుల్లో అనుకూల వాతావరణ పరిస్థితుల్ని ఏర్పాటు చేస్తున్నది.

- వి. సాయిబాబా, డిప్యూటీ డైరెక్టర్, ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్

మట్టి మాఫియా

(5వ పేజీ తరువాయి)


మట్టిని తవ్వడంతో ఏడడుగుల మేర ఏర్పడిన గుంతలు

గత ప్రభుత్వ హయాంలో నంద్యాలలో చెరువులు, కుంటలు, పంట భూములు.. అదీ ఇదీ అని లేకుండా ఎక్కడ పడితే అక్కడ వైసీపీ అనుయాయులు విచ్చలవిడిగా మట్టి తవ్వకాలు చేపట్టేవారు. దీనిపైన ప్రజల నుంచి విపరీతమైన వ్యతిరేకత వ్యక్తమైనా, అధికారులు చర్యలు తీసుకున్నా ఆగలేదు. ఇలాంటి పనుల వల్లే ప్రజలు వైసీపీని లేవలేని చావుదెబ్బ తీశారు. ప్రభుత్వం మారింది. ఇక నుంచి ఇలాంటి ఉండవని అందరూ భావించారు. మారింది ప్రభుత్వమే కాని, అక్రమార్కుల తీరు కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. గత ప్రభుత్వంలో ఆ పార్టీ అనుచరులు చెలరేగిపోతే, ప్రస్తుత అధికార పార్టీ నాయకులు చెలరేగిపోతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నందమూరి నగర్‌లో జరుగుతున్న మట్టి తవ్వకాల్లో టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకుల హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలోని కొంత మంది ఈ ప్రాంతంలో రాత్రిపూట గస్తీ కాస్తూ పోలీసులు ఎవరైనా వస్తున్నారా? ఇతర అధికారులు ఎవరైనా నిఘా పెట్టారా? అని గమనిస్తూ మట్టి రవాణాకు అడ్డంకులు లేకుండా చూసుకుంటున్నారు. ఇలా తరలిస్తూ నంద్యాల శివారులోని ఇటుక బట్టీలకు, వెంచర్లకు ట్రాక్టరు మట్టిని రూ.1500, టిప్పరు మట్టిని రూ.8000 పైగా అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారని సమాచారం. గత ప్రభుత్వాలు చేసిన తప్పులు ప్రస్తుతం చేయకూడదని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టంగానే చెబుతున్నారు. జిల్లా పై స్థాయి నాయకులు కూడా ఇదే మాట చెబుతున్నారు. కానీ కింది స్థాయి టీడీపీ నాయకులు ఈ మాట లను ఏమాత్రం పట్టించుకోవటం లేదు. అధికారం తమదే కాబట్టి తమను ఎవరూ అడగరని, ఒకవేళ తమ అక్రమాలను అధికారులు అడ్డుకున్నా ఆపై అధికారులతో పని చేసుకోవచ్చనే ధీమాతో మట్టి అక్రమార్కులు రెచ్చిపోతున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.


సరిహద్దు రాయిని తొలిగించిన దృశ్యం

రిచ్‌మండ్ విల్లా కాలనీలో చోరీ

- 15 తులాల బంగారు ఆభరణాలు, రూ.2 లక్షల నగదు అపహరణ

కర్నూలు క్రైం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కర్నూలులోని నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో రిచ్‌మండ్ విల్లా కాలనీలో చోరీ జరిగింది. వివరాలివీ.. నాగార్జున తన కుటుంబ సభ్యులతో కలిసి శనివారం నంద్యాలకు వెళ్లారు. ఆదివారం నాగార్జున ఇంట్లో లైట్లు వెలుగుతుండటంతో పక్కింటి వారు ఆయనకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. దీంతో నంద్యాల నుంచి వచ్చిన నాగార్జున తన ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. 15 తులాల బంగారు ఆభరణాలు, రూ.2 లక్షల నగదు చోరీ జరిగినట్లు బాధితుడు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిబంధనాల్లో పత్తి రైతు

(5వ పేజీ తరువాయి)


విక్రయానికి రైతులు తీసుకొచ్చిన పత్తి

సీసీఐ నిబంధనలు ఇవే....

- పత్తి రైతు ఖరీఫ్‌లో ఈ-పంట నమోదు చేసుకొని ఉండాలి.
- గ్రామాల్లో రైతుసేవా కేంద్రాలలో ముందుగానే పేర్లు నమోదు చేసుకోవాలి.
- పేర్లు నమోదు చేసుకున్నా సీసీఐ చెప్పిన రోజే కొనుగోలు కేంద్రానికి రైతులు తీసుకెళ్లాలి.
- పత్తి బోరాల్లో కాకుండా లూజుగా వాహనాల్లో తేమ లేకుండా తీసుకెళ్లాలి
- తేమ 8శాతం నుంచి 12శాతానికి మించరాదు
- పత్తికి 8శాతం ఉంటేనే కనీసం మద్దతు ధర రూ. 7521 చెల్లిస్తారు
- తేమశాతం ఒక్క శాతం అధికమైన రూ.75పైగా కోత
- పట్టాదారు, పాస్ పుస్తకం బ్యాంకు ఖాతా నెంబరు ఉండాలి
- కొనుగోలు చేశాక పది రోజుల తర్వాత చెల్లింపులు రైతు ఖాతాలో జమ
- ఎకరాకు మొదటి కోత దిగుబడిలో 40 శాతం మాత్రమే మొదట కొనుగోలు. అలా మూడు సార్లు విక్రయించుకునేందుకు నిబంధన
- సోమవారం నుంచి శుక్రవారం వరకు వారానికి ఐదు రోజులే కొనుగోలు
- కొనుగోలు కేంద్రాలకు వచ్చాక నిబంధనల పేరుతో సతాయింపు.

మద్దతు ధర ఉత్తిదే



కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర ఉత్తిదే. మార్కెట్లో ధరలు పతనమైనప్పుడు ఆదుకోవాల్సిన ప్రభుత్వ రంగ సంస్థ సీసీఐ రైతులను సతాయిస్తున్నారు. దిగుబడి ఉన్నా ధర లేక సీసీఐకి విక్రయించుకుందామంటే ఎకరాని ఇంతే కొంటామంటూ చెప్పండం భావ్యం కాదు. తీరా కొనుగోలు కేంద్రానికి వచ్చాక కొనుగోలు చేస్తారన్న నమ్మకం కూడా లేకుండాపోయింది. నిబంధనల వల్ల మద్దతు ధరకు అమ్ముకోలేక తక్కువ ధరకే అమ్ముకుంటున్నాము.

- సీతారాం రెడ్డి, పత్తి రైతు, నెరణికి గ్రామం, ఆలూరు

నిబంధనలు సడలించాలి

మార్కెట్‌లో రోజురోజుకు పత్తి ధరలు పతనమవుతున్నాయి. మద్దతు ధర కల్పిస్తామని సీసీఐ కొనుగోలు చేస్తున్న రైతులకు నిబంధనలు పెట్టింది. తేమశాతం, ఎకరాకు మొదట 40శాతం కొంటామని చెప్పడం రైతులను ఇబ్బందులు కలిగించడమే. నిబంధనలు సడలించి రైతుతో ఎన్ని క్వింటాళ్ల పత్తి ఉన్న సీసీఐ మద్దతు ధరలో కొనుగోలు చేయాల్సిందే లేనిపక్షంలో రైతులతో ఆందోళన చేపట్టాల్సి వస్తుంది.

- వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు, ఆదోని

నిబంధనల మేరకే కొనుగోలు

వ్యవసాయ శాఖ దిగుబడి సూచించిన మేరకే రైతుల నుంచి పత్తి కొనుగోలు చేస్తున్నాం. వ్యవసాయ శాఖ ఆన్‌లైన్‌లో మొదటికోతలో ఎకరాకు ఎంత వస్తే అంతే ఆ రైతు నుంచి కొంటాం. అలా మూడు దశల్లో రైతులు విక్రయించుకోవచ్చు. మా చేతుల్లో ఏమీ లేదు.

- సీసీఐ కేంద్ర బాధ్యుడు, ఆదోని

ఆందోళన చెందాల్సిన అవసరం లేదు



వ్యవసాయ శాఖ దిగుబడి అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపింది. సీసీఐ మూడు విడతల్లో రైతు నుంచి కొనుగోలు చేస్తుంది. మొదట విడతలో 40శాతం పత్తి దిగుబడి, రెండో విడతలో 40శాతం, చివరి కోత దిగుబడి 20శాతం కొంటుంది. కొన్ని నిబంధనలు సడలించాలని ప్రభుత్వాన్ని కోరాం. రైతులు ఆందోళన చెందకుండా మద్దతు ధరకు విక్రయించుకోవాలి.

- రామ్మోహన్ రెడ్డి, కార్యదర్శి, ఆదోని

మహానందిలో డీఐజీ పూజలు

మహానంది, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయం ముఖద్వారం వద్ద వేదపండితులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో కార్తీకమాసం పురస్కరించుకొని ప్రధాన ఆలయాల్లో డీఐజీ కుటుంబ సమేతంగా ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చన నిర్వహించారు. కల్యాణ మండపంలో వేదపండితులు రవిశంకర్ అవధాని ఆశీర్వదించారు. ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి స్వామివారి మెమెంటోను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో ఎర్రమల్ల మధు, పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ఆర్ఎస్ శ్రీనివాసులు, ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.


డీఐజీ కోయ ప్రవీణ్‌కు స్వామి మెమెంటోను అందజేస్తున్న ఈవో

ఉపకార వేతనాల కోసం దరఖాస్తుల స్వీకరణ

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): 2024-2025 విద్యా సంవత్సరానికిగాను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు, విద్యార్థులు తమ విద్యాబోధన ఫీజులు, ఉపకారవేతనాలు మంజూరు కోసం ఫ్రెష్, రెన్యువల్స్ కోసం జ్ఞానభూమి వెబ్ సైట్‌లో ఈ నెల 30వ తేదిలోగా దరఖాస్తు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ రంగలక్ష్మీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. నూతన విద్యాసంవత్సరానికిగాను 11,389 మంది విద్యార్థులకు కళాశాల జ్ఞానభూమి లాగిన్‌లో రిజిస్ట్రేషన్ లక్ష్యంకాగా, 2828 మాత్రమే పూర్తి చేశారన్నారు.

నేడు కేజీబీవీలో అభ్యర్థులకు కౌన్సెలింగ్

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కేజీబీవీలో బోధన, బోధనేతర పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డీఈవో, ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయ కర్త శామ్యూల్ పాల్ ఆదివారం తెలిపారు. దీనికి ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఆన్‌లైన్‌లో వెల్లడించినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. జాబితాలో పేర్లు ఉన్న అభ్యర్థులు సోమవారం ఉదయం 10 గంటలకు కర్నూలు జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని తెలిపారు.

నేడు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ రాక

కర్నూలు న్యూసిటీ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ సోమవారం కర్నూలు నగరానికి రానున్నట్లు నగర కార్యదర్శి పి. రామకృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాలో ఆయన పాల్గొంటారన్నారు. ఉదయం 9 గంటలకు సీపీఐ కార్యాలయం నుంచి ర్యాలీ కలెక్టరేట్‌కు బయలుదేరుతుందని తెలిపారు.

25న జడ్పీ సర్వసభ్య సమావేశం

కర్నూలు న్యూసిటీ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా పరిషత్ సర్వసభ్యసమావేశం ఈ నెల 25న నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి. నాసరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశ భవనంలో మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి ఐదుగురు మంత్రులు, ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, అధికారులు, ఎంపీలు, శాసనసభ్యులు హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మల్లన్న సన్నిధిలో మంత్రి సుధారాణి



శ్రీశైలం, నవంబరు 17(ఆంధ్రజోతి): శ్రీశైల మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవార్లను ఆదివారం రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సుధారాణి దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న మంత్రికి ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో మంత్రి సుధారాణికి వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థ ప్రసాదాలను స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు. భ్రమరాంబ అతిథి గృహంలో మంత్రికి స్థానిక గిరిజన సంఘాల నాయకులు శ్రీశైలం పరిధిలో చెంచు, గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. చెంచు, గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీవో శివప్రసాద్, సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. మరోసారి శ్రీశైలంలో పర్యటించి చెంచు గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు మంత్రి తెలిపారు.

అత్యాచారయత్నం కేసులో ముగ్గురిపై కేసు

చాగలమర్రి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి మండలంలోని ఓ పాఠశాలలో బాలికపై అత్యాచారయత్నం కేసులో పదోతరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు, పాఠశాల కరస్పాండెంట్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ రమేష్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి కోవెలకుంట్ల కోర్టుకు తీసుకెళ్లామని చెప్పారు. కర్నూలు సివిల్ కోర్టుకు ఇద్దరు విద్యార్థులు, కరస్పాండెంట్‌ను కోవెలకుంట్ల కోర్టుకు తరలించామని ఎస్ఐ తెలిపారు.

అక్రమాలకు పాల్పడిన వారిని వదలి పెట్టం

కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు


సమావేశంలో మాట్లాడుతున్న సోమిశెట్టి

కర్నూలు అర్బన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన ఎవర్నీ వదలి పెట్టమని కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (కుడా) కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో ఎన్నో అవకతవకలు జరిగాయని, ఎన్నో అక్రమ లేఅవుట్లు వేశారని, లే అవుట్‌కు ఆన్‌లైన్ ద్వారా అప్రూవల్ వేయాల్సి ఉండగా పంచాయతీ సెక్రటరీలు తమ పరిధిలోని లే అవుట్లకు ఆన్‌లైన్ అప్రూవల్ చేయించకుండా ఆన్‌లైన్ ద్వారా అప్రూవల్ చేసి అక్రమాలకు పాల్పడ్డారని అన్నారు. దీన్ని అరికట్టడానికి డీపీవోలతో చర్చించిన అనంతరం పంచాయితీలను డివిజన్ల వారీగా ఏర్పాటు చేసిన పంచాయతీ సెక్రటరీలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. ప్రజల కోసం అన్ని వసతులు అందుబాటులో ఉంచేందుకు ఎస్‌టీఆర్ టౌన్ షిప్‌లో తక్కువ ధరలో పేదలకు ప్లాట్లు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వైఎస్ జగన్‌చేసిన అవినీతి వల్ల అధికారులందరూ ఇరుకున్నారని, వారికి శిక్ష దారుణంగా ఉంటుందని అన్నారు.

పుస్తకం తలెత్తుకొని బతికేలా చేస్తుంది

ఆర్‌యూ ఉపకులపతి ఎన్‌టీకే నాయక్


ప్రసంగిస్తున్న ఆర్‌యూ ఉపకులపతి ఎన్‌టీకే నాయక్

కర్నూలు కల్చరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తలదించుకొని కష్టపడి చదివే పుస్తకమే యువతను తలెత్తుకొని బతికేలా చేస్తుందని రాయలసీమ యూనివర్శిటీ ఉప కులపతి ఆచార్య ఎన్‌టీకే నాయక్ అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా నాలుగో రోజు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగిన కవి సమ్మేళనం, పుస్తక పరిచయ కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. తొలుత గ్రంథాలయ ఉద్యమానికి కృషి చేసిన మహనీయుల చిత్ర పటాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆచార్య ఎన్‌టీకే నాయక్ మాట్లాడుతూ మంచి పుస్తకాలకు, సెల్‌ఫోన్లకు ఉన్న వ్యత్యాసాన్ని యువత గమనించాలని అన్నారు. రెండూ తల వంచుకొని చూసినా, పుస్తకం విజ్ఞానాన్ని అందించి భవిష్యత్తులో తల ఎత్తుకొని బతికే మార్గాన్ని చూపిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కవి సమ్మేళనానికి సాహితీ సదస్సు సంస్థ కార్యదర్శి జేఎస్‌ఆర్‌కే శర్మ అధ్యక్షత వహించారు. కవులు కా.వెం. సుబ్బలక్ష్మమ్మ, గద్వాల సోమన్న, సయ్యద్ జహీర్ అహ్మద్, ఇనాయతుల్లా, ఆవుల బసప్ప, బోయ శేఖర్, స్వరూప్ సిన్హా తదితరులు ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు. కవి గద్వాల సోమన్న రాసిన 'చిరు మువ్వలు' అనే పుస్తకాన్ని సభలో ఆవిష్కరించారు. కవులను ఆచార్య ఎన్‌టీకే నాయక్, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె. ప్రకాశ్ శాలువలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

సాంస్కృతిక దాడులు పెరిగాయి


మాట్లాడుతున్న నాటక రచయిత ఆకురాతి భాస్కర్

కర్నూలు కల్చరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): దేశంలో స్వేచ్ఛ పేరుతో సాంస్కృతిక దాడులు పెరిగాయని, వాటిని అడ్డుకోవాల్సిన అవసరం ఉందని ప్రముఖ నాటక రచయిత, హైదరాబాదుకు చెందిన ఆకురాతి భాస్కర్ అన్నారు. ఆదివారం రాత్రి నగరంలోని టీజీవీ కళా క్షేత్రంలో హైదరాబాదుకు చెందిన మిత్ర క్రియేషన్స్ నాటక సంస్థ ఆధ్వర్యంలో 'ఇది రహదారి కాదు' సందేశాత్మక నాటక ప్రదర్శన జరిగింది. ఇది ప్రేక్షకులను అలరించింది. అంతకు ముందు ఏర్పాటు చేసిన సభలో నాటక రచయిత ఆకురాతి భాస్కర్ మాట్లాడుతూ సమాజంలో స్వేచ్ఛ ఉందని, కానీ అది దుర్వినియోగానికి దారి తీస్తోందని అన్నారు. పెళ్లి కాకుండా సహజీవనం పేరుతో కలిసి ఉండటం ఏమిటని ప్రశ్నించారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, నాటక దర్శకుడు బాషా, బీసీ సంఘం జాతీయ కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, ఆర్‌యూ ప్రొఫెసర్ రంగనాయకులు పాల్గొన్నారు.

నారా రామ్మూర్తి నాయుడికి నివాళి


నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

కర్నూలు అర్బన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నారా రామ్మూర్తి నాయుడుకు టీడీపీ నాయకులు ఘనంగా నివాళి అర్పించారు. ఆదివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో చిత్ర పటానికి కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నంద్యాల నాగేంద్ర, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సత్రం రామక్రిష్ణ, నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, షేక్షావలి, నాయకులు పూలమాలలు వేసి సంతాపం వ్యక్తం చేశారు.

అపార్‌తో విద్యాబోధనకు ఆటంకం

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అపార్ విద్యార్థుల బోధనకు ఆటకంగా మారిందని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరాముడు, జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరె కృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు అపార్ నంబర్లను కేటాయించడం కోసం డిజిటల్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. తుది గడువును వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు ఇచ్చిందన్నారు. అపార్‌ను పూర్తి చేయాలని విద్యాశాఖ అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్‌పై ఒత్తిడి చేయడం సరికాదన్నారు. ఆధార్‌లో ఉన్న వివరాలకు, పాఠశాల అడ్మిషన్ రికార్డ్‌లోని వివరాలకు, విద్యార్థి జనన ధ్రువీకరణ వివరాలకు సరిపోవాలన్నారు. ఇవి ఒకదాన్నికొక్కటి తేడాలు ఉన్నాయన్నారు. దీంతో తీవ్రకాలయాపన జరుగుతుందన్నారు. గ్రామాల్లో పిల్లల తల్లిదండ్రులు వ్యవసాయ పనుల్లో తీరిక లేకుండా ఉన్నారన్నారు. సకాలంలో తల్లిదండ్రులు ఆధార్ కేంద్రాలకు వెళ్లలేక కాలయాపన జరుగుతుందన్నారు. పిల్లల తల్లిదండ్రులు బాధ్యతను ఉపాధ్యాయులపై రుద్దడం భావ్యం కాదన్నారు.

పద్మశాలీయుల కార్తీక వనభోజనం


కొంకతి లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న మాజీ ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్, సంఘం నాయకులు

కర్నూలు కల్చరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కర్నూలు పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని సుంకేసుల రోడ్డులో గల ఎస్ ఎల్ఎన్ గార్డెన్స్‌లో నిర్వహించిన కార్తీక వనభోజనం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా కర్నూలు మాజీ పార్లమెంటు సభ్యుడు డాక్టర్ సంజీవ్ కుమార్ హాజరయ్యారు. ఉసిరిక చెట్టు వద్ద దామోదర పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ మాట్లాడుతూ కార్తీక వన భోజనాన్ని సామూహికంగా నిర్వహించడం వల్ల పరస్పర స్నేహభావనలు పెంపొందుతాయని అన్నారు. ఇటీవల రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన కొంకతి లక్ష్మీనారాయణను, వివిధ రంగాల్లో రాణిస్తున్న పద్మశాలి ప్రముఖులను మాజీ ఎంపీ తదితరులు సత్కరించారు. ఈసందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కర్నూలు పద్మశాలి సంఘం అధ్యక్షుడు కస్తూరి వేమయ్య, ప్రధాన కార్యదర్శి మేడం సుంకన్న, కోశాధికారి గుర్రం శివప్రసాద్, సంఘం ఉపాధ్యక్షుడు కస్తూరి ప్రసాద్, కార్యదర్శి జేరుబండి హరిప్రసాద్, ఇతర ప్రతినిధులు శిరుశాల లక్ష్మీనారాయణ, గోవిందు, కాల్వ సంజీవకుమార్, గోరంట్ల లక్ష్మీనారాయణ, కస్తూరి మనోహర్ బాబు పాల్గొన్నారు.


ఉసిరి చెట్టు వద్ద పూజలు చేస్తున్న సంఘం నాయకులు

సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి


మాట్లాడుతున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని టీడీపీ పాలక మండలి సభ్యుడు మల్లెల రాజశేఖర్ పార్టీ శ్రేణులను కోరారు. ఆదివారం మండలంలోని హుస్సేనాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ సభ్యత్వ నమోదు కార్యకర్తకు భరోసా ఇస్తుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బజారు, వేణు, రజాక్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

సి.బెళగల్: టీడీపీ కార్యకర్తలు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని పార్టీ మండల కన్వీనర్ గోవిందు గౌడు అన్నారు. ఆదివారం సి.బెళగల్‌లోని తన స్వగృహంలో టీడీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5లక్షలు, సాధారణంగా మరణిస్తే రూ.2లక్షలు బీమా వర్తిస్తుందన్నారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ ఈరన్నగౌడు, టీడీపీ నాయకులు బాలాజి వెంకటేశ్, బీమన్న, గోవిందు, గౌస్ పాల్గొన్నారు.

జైపూర్‌లో స్టాండింగ్ అధ్యయన కమిటీలో ఎంపీ

కర్నూలు అర్బన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జైపూర్ వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ అధ్యయన పర్యటనలో ఎంపీ బస్తిపాటి నాగరాజు వెళ్లారు. ఆదివారం రాజస్థాన్ రాష్ట్రంలో రెండు రోజుల పర్యటనలో స్టాండింగ్ కమిటీ చైర్మన్ కనిమొళి, సభ్యుడైన ఎంపీ బస్తిపాటి నాగరాజు బ్యాంకుల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో భాగంగా బ్యాంకింగ్ రంగంలో వినియోగదారుల హక్కులను రక్షించడం, అన్యాయమైన విధానాల నుంచి ప్రజలను మేల్కొల్పడం, వారి హక్కులను కాపాడడంపై చర్చించారు.


సమావేశంలో పాల్గొన్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

గంగపుత్ర కార్తీక వనభోజనం


సినీ నటుడు ఫిష్ వెంకట్‌తో సిటీ బెస్త తెలుగు గంగపుత్ర సంక్షేమ సంఘం నాయకులు

కర్నూలు కల్చరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కర్నూలులోని సిటీ బెస్త తెలుగు గంగపుత్ర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనభోజన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. పాతనగరంలోని జమ్మిచెట్టు సమీపంలోగల లలితా పీఠంలో ఏర్పాటు చేసిన ఈ వనభోజన మహోత్సవానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ నటుడు ఫిష్ వెంకట్ హాజయ్యారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు ఎస్ మల్లికార్జున, గౌరవ సలహాదారులు రామయ్య, నగర అధ్యక్షుడు ఆనందరాజ్ బాలు, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ కదిరి రమేష్, నగర ప్రధాన కార్యదర్శి నాగ రమణ, జాయింట్ సెక్రటరీ ఎల్ల కృష్ణ, ఉపాధ్యక్షుడు జలగరి వెంకటేశ్వర్లు, కోశాధికారి వెంకటేశ్ బాబు పాల్గొన్నారు.

యాదవ భవన్ నిర్మాణానికి విరాళం

కర్నూలు అర్బన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నగరంలో యాదవ్ భవన్ నిర్మాణానికి రూ.లక్ష విరాళం ఇస్తున్నట్లు టీడీపీ నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్ తెలిపారు. ఆదివా రం నగరంలో నిర్వహించిన యాదవ సంఘం వనభోజనం కార్యక్రమానికి ఏపీ రామయ్య యాదవ్, డాక్టర్ బాలమద్దయ్య హాజరయ్యారు. ఈసందర్భం గా నాగరాజు యాదవ్ మాట్లా డుతూ యాదవ్‌లు రాజకీయంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో విజయభాస్కర్, ఎర్రదొడ్డి రాముడు యాదవ్, ఓంకార్ యాదవ్, సదానందం, సీతారం, ఓబులేసు యాదవ్, మాజీ ఎంపీపీ పద్మావతి, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

కుడా చైర్మన్‌ను కలిసిన టీడీపీ నాయకులు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సోమిశెట్టి వెంకటేశ్వర్లును టీడీపీ సీనియర్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం 52వ వార్డుకు చెందిన వి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో సోమిశెట్టిని ఆయన నివాసంలో కలిసి పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ కుడా చైర్మన్‌గా రెండో సారి పదవీ బాధ్యతలు చేపట్టిన సోమిశెట్టికి అభినందనలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు విజేయుడు, మధు, లక్ష్మీనారాయణ, సాయి పాల్గొన్నారు.

44వ వార్డులో కమిషనర్ పర్యటన

కర్నూలు న్యూసిటీ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నగరంలోని 44వ వార్డు వెంటకరమణ కాలనీలో నగర పాలక కమిషనర్ ఎస్. రవీంద్రబాబు పర్యటించారు. ఆదివారం కార్పొరేటర్ రాజేశ్వరెడ్డితో కలిసి పలు వీధుల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. రహదా రులు, డ్రైనేజీల నిర్మాణం, పార్కు స్థలాల అభివృద్ధి, పారిశుద్ధ్య, తాగునీటి పైప్‌లైన్ల మరమ్మతులు వంటి సమస్యలను కమిషనర్ పరిశీలించారు.

నీటి సరఫరాపై నివేదికలు సమర్పించాలి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా ఒంగోలు మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించే సమయంలో నీటి సరఫరాలో వచ్చిన ఆరోపణలపై తక్షణమే నివేదికలు సమర్పించాలని నగర పాలక కమిషనర్ ఎస్. రవీంద్రబాబుకు రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై రాతపూర్వకంగా స్టేట్‌మెంట్ ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

సి.బెళగల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంబందహాల్ గ్రామానికి చెందిన పరమేష్ పెద్దకుమారుడు శివప్రసాద్ (15) ఈ నెల 15న పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేసి కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో ఆదివారం మరణించాడు. విద్యార్థి కంబందహాల్ గ్రామంలో ఉన్నత పాఠశా లలో పదో తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు సక్రమంగా ఎందుకు వెళ్లడం లేదని తండ్రి మందలించడంతో ఆత్మహ త్యాయత్నం చేసి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్ఐ తిమ్మారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గౌడలు ఐక్యంగా ఉండాలి


శివ సాయిబాబా గురుజీని సన్మానిస్తున్న కేఈ ప్రభాకర్

కర్నూలు అర్బన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): గౌడలు ఐక్యంగా ఉండాలని టీడీపీ నాయకుడు మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ అన్నారు. ఆదివారం నగరంలోని నగరంలోకి కిసాన్ ఘాట్ ఎదురుగా ఉన్న స్వామి గుడిలో గౌడల వనభోజన మహోత్సవానికి కేఈ ప్రభాకర్‌తో పాలు శివ సాయిబాబా గురు జీ, ఈడిగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కేఈ కుమార్, గంగాధర్ గౌడ్, వర్కింగ్ ప్రసిడెంట్ కాసాని మహేష్ గౌడ్ హాజరయ్యారు. ఈసందర్భంగా శివ సాయిబాబా గురుజీ మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ సన్మానించారు.

పరిపాలనలో రెవెన్యూ కీలకం

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పరిపాలనలో రెవెన్యూ శాఖ కీలకమని ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి లక్ష్మీరాజు అన్నారు. ఆదివారం ఏపీఆర్ఎస్ఏ ఆధ్వర్యంలో అలం పూర్‌లో కార్తీక వనభోజనాన్ని నిర్వహించారు. కేఆర్ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ ప్రసన్న లక్ష్మి, విశాంత్రి అదనపు డిప్యూటీ కలెక్టర్ రామస్వామి, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి: మాజీ ఎంపీ

కర్నూలు కల్చరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని కర్నూలు మాజీ పార్లమెంటు సభ్యుడు డాక్టర్ సంజీవ్‌కుమార్ అన్నారు. ఆదివారం నగరంలోని వెంకటరమణ కాలనీలోగల చిన్మయ మిషన్ ఆశ్రమంలో జిల్లా స్థాయి భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ భగవద్గీతలోని సారాంశం మానవ మనుగడకు ఉపయోగపడుతుందని అన్నారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చిన్మయ మిషన్ కర్నూలు ఇన్‌చార్జి స్వామిని సుప్రేమానంద, సంస్థ అధ్యక్షుడు ఐ.విజయకుమార్ రెడ్డి, కార్యదర్శి టీవీ రత్నప్రసాద్, ఉపాధ్యక్షులు ఎస్ శ్రీనివాసరావు, ఆర్ లక్ష్మి, ఆవోపా కన్వీనర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో జీవించాలి: సీఐ

సి.బెళగల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో జీవించాలని కోడుమూరు సీఐ తబ్రేజ్ అన్నారు. ఆదివారం పోలకల్లు, సిబెళగల్ గ్రామాలలో ఆయన మాట్లాడుతూ గూడూరు, సిబెళగల్ పోలీసు స్టేషన్ల పరిధిలోని ఆయా గ్రామాల్లోని రౌడీ షీటర్లు రచ్చ కట్ట పంచాయతీలు, చిల్లర దొంగతనాలు వంటి వాటికి పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. సీఐ వెంట సి.బెళగల్ ఎస్ఐ తిమ్మారెడ్డి, పోలీసులు ఉన్నారు.

ఆలయాల్లో కార్తీకమాస పూజలు

ఓర్వకల్లు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్వ బుగ్గ రామేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం కార్తీక మాసం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి పుష్కరిణిలో పుణ్య స్నానాలు ఆచరించి శివునికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అనంతరం ఉసిరిక చెట్టుకు పూజలు జరిపి కార్తీక దీపాలు వెలిగించారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి చేయండి

ఓర్వకల్లు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలలోని లోటుపాట్లను అధిగమించి సహకార సంస్థల బలోపేతానికి కృషి చేయాలని కర్నూలు డివిజనల్ సహకార అధికారి ఎస్. జఫ్రీన్ పేర్కొన్నారు. మండల కేంద్రం ఓర్వకల్లులోని వ్యవసాయ సహకార పరపతి సంఘం వద్ద 71వ అఖిల భారత సహకార వారోత్సవాలను సంఘం సీఈవో మద్దిలేటి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. అధికారి ఎస్.జఫ్రీన్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణయ్య పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడా పరికరాలు పంపిణీ

కర్నూలు కల్చరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తైక్వాండో క్రీడాకారులకు టీడీపీ నాయకుడు, కర్నూలు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తమరెడ్డి క్రీడా పరికరాలు పంపిణీ చేశారు. నగరంలోని కొండారెడ్డి బురుజు వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో విద్యార్థులు రాణించాలన్నారు. ఉచిత శిక్షణ ఇస్తున్న కోచ్‌లను ఆయన అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ శిక్షకుడు వెంకటేశ్వర్లు, శిక్షణ మాస్టర్లు టి. అజయ్, టి.తేజ, టీడీపీ నాయకులు మంజునాథ్‌రెడ్డి, నాగిరెడ్డి, ప్రభాకర్ యాదవ్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

గూడూరు నవంబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను సద్విని యోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె ప్రకాష్ అన్నారు. ఆదివారం ఆయన గూడూరు శాఖ గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మధు నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి సహకారం: టీజీ వెంకటేశ్



తైక్వాండో పోటీల లోగోను ఆవిష్కరిస్తున్న టీజీ వెంకటేశ్

కర్నూలు కల్చరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): డిసెంబరు నెలలో జరిగే తైక్వాండో క్రీడా పోటీలకు సహకారం అందిస్తానని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. ఆదివారం ఆయన నివాసంలో జిల్లా ఓపెన్ తైక్వాండో క్రీడా పోటీల లోగోను క్రీడాకారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ డిసెంబరు 14, 15 తేదీల్లో సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగంలో నాలుగు ఈవెంట్లు నిర్వహిస్తున్నారని, సుమారు 300 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని, వారికి తగిన ఆర్థిక సాయం అందజేస్తామని చెప్పారు. తైక్వాండో సంఘం జిల్లా జాయింట్ కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత ముప్పయ్ ఏళ్లగా క్రీడాలకు టీజీ వెంకటేశ్, మంత్రి టీజీ భరత్ ఆర్థిక సాయం అందిస్తున్నారని, వారి సహకారం మరువలేనిదని చెప్పారు.

ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం: ఎస్టీయూ


సంఘీభావం తెలుపుతున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

కోడుమూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉద్యమాలతోనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ఆదివారం ఎస్టీయూ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైంద న్నారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని, జీవో 117తోపాటు సీపీఎస్, జీపీఎస్‌లను రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి డిమాండ్ చేశారు. అంతేకాకుండా రూ.21వేల కోట్ల బకాయిలను విడుదల చేయాలని, ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించి పాఠశాల సహాయకులకు జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న, నాయకులు తిరుమలరెడ్డి, రామచంద్రుడు, దేవదాను, ఉచూరప్ప, వేణుగోపాల్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి


మాట్లాడుతున్న కృష్ణ

గూడూరు నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి కృష్ణ అన్నారు. ఆదివారం గూడూరు మండలం చనుగొండ్ల గ్రామంలో బి కృష్ణ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి శేషు కుమార్ పేదలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, గ్రామాల్లో ఉన్న వారికి 3 సెంట్లు, పట్టణాల్లో ఉన్న వారికి 2 సెంట్లు ఇవ్వాలన్నారు. సోమవారం నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

జయప్రదం చేయండి: సీపీఎం

కర్నూలు న్యూసిటీ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 26న చేపడుతున్న ఆందోళనను జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు కే.ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కేకే భవన్‌లో జరిగిన ఏపీ వేర్‌హౌస్ హమాలీ యూనియన్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయం, కార్పొరేటీకరణ, జీవనోపాదులపై బీజేపీ ప్రభుత్వాలు సాగిస్తున్న దాడులు తిప్పికొట్టాలన్నారు. దేశవ్యాప్తంగా అన్ని జిల్లాలో ఆందోళనలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, నగర కార్యదర్శి టి.రాముడు, హమాలీ యూనియన్ కార్యదర్శి ఎం.మల్లికార్జున, విష్ణుమూర్తి, కే.సుధాకర్ పాల్గొన్నారు.

వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్‌ను కలిసిన నాయకులు

ఓర్వకల్లు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన మంజునాథ్‌ను ఆదివారం హుస్సేనాపురం గ్రామానికి చెందిన జనసేన నాయకులు మోహన్, శివలు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయనను శాలువాలతో సన్మానించారు.

కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలి

ఆదోని టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎస్సీల్లోని అన్ని కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని మోస్ట్ బ్యాక్‌వర్డ్ షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి ఉపాధ్యక్షుడు నాగరాజ్ గౌడ్ కోరారు. ఆదివారం మాట్లాడుతూ ఎస్సీల్లో 59 కులాలున్నాయని అన్నిటికీ ఒకే కార్పొరేషన్ ఉంటే అందరికీ మేలు జరగదన్నారు. ఈమేరకు సీఎం చంద్రబాబుకు లేఖ రాసినట్లు తెలిపారు.

కవులు, కళాకారులకు సన్మానం



కవి అన్నె శ్రీనివాస రెడ్డిని సన్మానిస్తున్న అధికారులు

ఆలూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక గ్రంథాలయంలో కవి సమ్మేళనాలు, రచయితల సందేశాల కార్యక్రమం నిర్వహించారు. కవి అన్నె శ్రీనివాస రెడ్డి, ఈశ్వరప్పలను సన్మానించారు. పౌరాణిక పాత్రధారులు, ప్రదర్శనలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి విజయ భాస్కర్ మాట్లాడుతూ కళలను, కవులను, కళాకారులను గౌరవించాలన్నారు. పౌరాణిక పాత్రధారులు శీనప్ప, గోపీని రంగన్న, గోపిని ఈరన్న పాల్గొన్నారు.

జర్నలిస్టులు సమాజ సేవకులు

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉన్న జర్నలిస్టులు సమాజ సేవకులని ఆర్యవైశ్య అఫిషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్, ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు డాక్టర్ వంకదారు శ్రీనాథ్ గుప్తా అన్నారు. ఆదివారం గోపీనాథ్ ఆసుపత్రిలో ఆవోపా, వామ్చ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ జర్నలిస్టుల దినోత్సవాన్ని నిర్వహించారు. జర్నలిస్టులను సన్మానించారు గౌస్, నాగరాజు, మునెప్ప, రఘు, చిన్న, హుసేని, వెంకటేశ్వరులు, కిరణ్, మహిళా విభాగం అధ్యక్ష, కార్యదర్శులు వంకదారు మమతా శ్రీ, సంగీత, ప్రతాప్, హిమ బిందు, లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ధర్మారెడ్డి వన్నప రాజు, మల్లికార్జున గౌడ్, ఓంకార్ పాల్గొన్నారు.

మద్యం తాగి నడిపితే కేసు, జరిమానా

మద్దికెర, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే కేసు నమోదు చేసి, రూ.10వేల జరిమానా విధిస్తామని ఎస్ఐ విజయ్‌కుమార్ నాయక్ హెచ్చరించారు. ఆదివారం మెయిన్ బజార్, బస్టాండ్ వద్ద ప్రజలకు అవగాహన కల్పించారు. తాగి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగి, కుటుంబం రోడ్డున పడుతుందన్నారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, వాహన ధ్రువీకరణ పత్రాలను దగ్గర ఉంచుకోవాలని సూచించారు. యువత గంజాయి, మాదక ద్రవ్యాలను వాడి జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. గ్రామస్థులు జక్కన్న, శ్రీనివాసులు, కృష్ణ, తదితరులు ఉన్నారు.

వాల్మీకులకు కూటమితోనే న్యాయం

- వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బొజ్జమ్మ



బొజ్జమ్మను సన్మానిస్తున్న నాయకులు

దేవనకొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వాల్మీకులకు కూటమి ప్రభుత్వంతోనే న్యాయం జరుగుతుందని వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ అన్నారు. ఆదివారం ఆమెను డైరెక్టర్ మంజునాథ, గుండ్లమ లాపురం టీడీపీ నాయకులు ఆమెను సన్మానించారు. మాజీ ఎంపీపీ రామచంద్రనాయుడు తదితరులు ఉన్నారు.

ఆర్టీఛీ బస్టాండ్



మద్దికెర ఆర్టీసీ బస్టాండు ఇదే

మద్దికెర, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలం కేంద్రంలోని బస్టాండును అప్పటి ఎంపీ కేఈ కృష్ణమూర్తి, నాటి సర్పంచ్ కొత్తపేట వెంకటేశ్వరరెడ్డి ప్రయాణీకుల సౌకర్యార్థం నిర్మించారు. అయితే నిర్వహణ లేకపోవడం, బస్సులు ఇక్కడ ఆపకపోవడంతో ఇలా తయారైంది. మందుబాబులు, బిచ్చగాళ్ల అడ్డాగా మారింది. ఆర్టీసీ, పంచాయతీ అధికారులు స్పందించి ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ముక్కు మూసుకో..



తుగ్గలి మండలం రోళ్లపాడు తండా రోడ్డు దుస్థితి

తుగ్గలి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రోళ్లపాడు తండాలో డ్రైనేజీ శుభ్రం చేయకపోవడంతో మురుగు రోడ్డుపై ప్రవహిస్తోంది. ముక్కు మూసుకుంటే తప్ప నడవలేని పరిస్థితి. రోళ్లపాడు, ఎల్లమ్మగుడి తండా గ్రామాలు కలిపి నూతన పంచాయితీగా ఏర్పాటైంది. సర్పంచ్ బాలమ్మ మృతి చెందినా ఇప్పటి వరకు ఎన్నికలు నిర్వహించలేదు. దీంతో పట్టించుకునేవారు లేరు. గ్రామ కార్యదర్శి, సిబ్బంది అటువైపు రావడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వేదవతికై నేడు రౌండ్ టేబుల్ సమావేశం

ఆలూరు రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వేదవతి ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయించాలని సోమవారం జ్యోతి బసు భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సీపీఎం కార్యదర్శి షాకీర్ అన్నారు. ఆదివారం మాట్లాడుతూ ఆలూరు ప్రాంతంలో సాగు, తాగునీరు లేక ప్రజలు, వ్యవసాయ కూలీలు వలస పోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించి పనులు మొదలు పెడుతుందనుకుంటే మొండి చేయి చూపిందన్నారు.

బీమా అభినందనీయం

ఆదోని టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప భక్తులకు కేరళ ప్రభుత్వం ఉచిత బీమా కల్పించడం అభినందనీయమని మండిగిరి టీడీపీ మాజీ కౌన్సిలర్ శ్రీనివాస ఆచారి అన్నారు. ఆదివారం మాట్లాడుతూ భక్తులు ప్రమాదాలకు గురై, కొందరు మరణించారన్నారు.

కార్తీక మాసం పూజలు



పూజలు చేస్తున్న అర్చకులు

హొళగుంద, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : దేవరగట్టు మాల మల్లేశ్వర స్వామి ఆలయంలో కార్తీకమాసం మూడో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు పూజారులు మల్లికార్జున స్వామి, మల్లయ్య స్వామి ఆదివారం తెలిపారు. తెల్లవారుజాము నుంయి మహా మంగళహారతి, ఆకుపూజ, రుద్రాభిషేకం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి కాక ఆంధ్ర, కర్ణాటక నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

'సహకార' అధ్యక్ష పీఠంపై
తమ్ముళ్ల ఆశలు

- టీడీపీ ఇన్‌చార్జి ఆశీస్సులు ఎవరికో?
- పోటీ పడుతున్న నాయకులు
- ఇప్పటికే రైతులతో సభ్యత్వాన్ని చేయిస్తున్న నాయకులు



ఆలూరులోని విశాల సహకార సొసైటీ కార్యాలయం

ఆలూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక విశాల పరపతి సంఘం అధ్యక్ష పదవిపై తెలుగు తమ్ముళ్లు ఆశలు పెంచుకుంటున్నారు. 2013లో ఎన్నికలు నిర్వహించారు. అనంతరం మళ్లీ ఎన్నికలు నిర్వహించలేదు. గతంలో వైసీపీ ప్రభుత్వం త్రీమెన్ కమిటీని నియమించింది. ఇందులో ఒకరు అధ్యక్షుడు కాగా, ఇద్దరు డైరెక్టర్లు ఉండేవారు. గతంలో ఈ పదవులు పెద్దహోతూరు, హత్తిబెళగల్, మొలగవల్లి గ్రామాల నాయకులకు దక్కాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక 11మంది డైరెక్టర్లు, అధ్యక్షుడు ఉండేలా నిర్ణయం తీసుకుంది. సొసైటీలో దాదాపు 3వేల మంది వరకు రైతులు సభ్యులుగా ఉన్నారు.

సభ్యత్వం మొదలు..

పదవి దక్కించుకునేందుకు ముందస్తుగా ఒక్కొక్కరు 30నుంచి40 మంది రైతులతో సభ్యత్వం కూడా చేయించారు. ఆదాయ వనరుగా ఉన్న ఈ పదవి ఎలాగైన దక్కించుకోవాలని రైతులతో సంబంధాలు పెంచుకుంటున్నారు. మరి టీడీపీ ఇన్‌చార్జి ఈ పదవిని ఎవరికి కట్టబెడతారో చూడాలి.

నాయకుల ప్రయత్నాలు

పదవి దక్కించుకునేందుకు ఆశావహులు ప్రయత్నాలు మొదలు పెట్టారు. టీడీపీ ఇన్‌చార్జిని ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. పదవి కోసం ఓ విలేకరితో పాటు కురువ వర్గానికి చెందిన మొలగవల్లి బెలగంటి హనుమప్ప, మైనారిటీ వర్గానికి చెందిన అరికేర వన్నూరవల్లి, జిలానీ, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నరసప్ప, కొమ్ము రామాంజనేయులు, వాల్మీకి సామాజిక వర్గానికి చెదిన డా.నెట్టప్ప, ముద్దురంగ, యాదవ వర్గం నుంచి ఉగాది రాము ప్రయత్నిస్తున్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

పత్తికొండ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆటోలో తరలిస్తున్న 250 కిలోల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం పత్తికొండ పట్టణానికి చెందిన షేక్ ఖాశీంవలి తన ఆటోలో రేషన్ బియ్యం బస్తాలను తరలిస్తుండగా బైపాస్ వద్ద పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. పత్తికొండ ప్రాంతంలో రేషన్‌బియ్యం సేకరించి హోసూరు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్‌రెడ్డికి చేరవేస్తుంటానని ఖాశీంవలి తెలిపాడు. కాగా రేషన్‌బియ్యం అక్రమ రవాణాపై తహసీల్దార్ కార్యాలయానికి సమాచారం అందించామని, వారు పంచనామా నిర్వహించాక కేసు నమోదు చేస్తామని సీఐ జయన్న తెలిపారు.

ఎన్నికలు నిర్వహించాలి

పత్తికొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ రీడింగ్‌రూం ఎన్నికలు నిర్వహించాలని కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం అధ్యక్షుడు పూనామల్లికార్జున అధ్యక్షతన రీడింగ్‌రూం కమిటీ సమావేశం నిర్వహించారు. కొన్ని సంవత్సరాలుగా ఎన్నికలు నిర్వహించకుండా రెన్యువల్ చేస్తుండటంపై సభ్యులు ప్రశ్నించారు. రీడింగ్‌రూం చుట్టూ దుకాణాల అద్దెలు, ఆదాయం వివరాలను సభ్యులకు తెలియ చేయడం లేదన్నారు. స్పందించిన అధ్యక్షుడు పూనా మల్లికార్జున వచ్చేమార్చిలో కమిటీ ఎన్నిలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు.

అవయవదానం చేయాలి

ఎమ్మిగ నూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ అవయవ దానం చేయాలని టీడీపీ కౌన్సిలర్ దయాసాగర్ అన్నారు.

ఆదివారం ఎమ్మిగనూరులో ఆయన మోహన్ ఫౌండేషన్ హైదరాబాద్ వారికి ఆయన అవయవదానం చేస్తున్నట్లు పత్రాలపై సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవయవదానం చేయడం వల్ల మరో వ్యక్తికి పునర్జన్మ ఇవ్వవచ్చన్నారు. సమాజానికి మంచి చేయాలన్న ఆలోచన ఉండాలన్నారు. త్వరలో ఓ ఫౌండేషన్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

జనసేన కార్యాలయం ప్రారంభం



కార్యాలయంలో జనసేన నాయకులు

ఆస్పరి నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జోహరాపురం గ్రామంలో జనసేన పార్టీ నూతన కార్యాలయాన్ని ఏపీ రాష్ట్ర కురుబ కార్పోరేషన్ డైరక్టర్ ఉదయ్‌కుమార్, జనసేన కన్వీనర్ అరవింద్ ఆదివారం ప్రారంభించారు. అధినేత పవన్‌కళ్యాణ్ ఆశయసాధన కోసం పని చేస్తామన్నారు. నియోజకర్గంలోని జనసైనికుడికి చిన్న సమస్య వచ్చినా పరిష్కరిస్తామన్నారు. నరేష్, రామకృష్ణ, రాకేష్, వినోద్ పాల్గొన్నారు.

ధ్యానం చేయండి

మద్దికెర, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ధ్యానం చేయడం వల్ల మనసుకు ప్రశాంతత ఉంటుందని నిర్వాహకులు పోలీ పక్కీరప్ప, వసంత అన్నారు. ఆదివారం స్థానిక వశిష్ఠ పాఠశాలలో హార్ట్‌ఫుల్ సంస్థ ఆధ్వర్యంలో ధ్యానం చేయించారు. మనిషి తీరిక లేని సమయం గడుపుతున్నాడని, మానసిక ప్రశాంతత కోసం ధ్యానం చేయడం మంచిదని సూచించారు. ప్రతి రోజు కనీసం గంటపాటైన ధ్యానం చేయాలన్నారు.



వనభోజనంలో పాల్గొన్న కాలనీవాసులు

ఉత్సాహంగా వన భోజనం

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తిరుమల నగర్ కాలనీలో ఆదివారం వన భోజనాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. కాలనీవాసులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆట, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన చిన్నారులకు మహిళలకు బహుమతులను ప్రదానం చేశారు. కాలనీవాసులు రఘురామయ్య, కృష్ణమూర్తిగౌడ్, హనుమంతరావు, గోపాల్, శివరాం రెడ్డి, శ్రీకాంత్, ధనుంజయ రెడ్డి, నరసయ్య గౌడ్ పాల్గొన్నారు.

కష్టపడితే పదవులు

మద్దికెర, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడితే పదవులు వస్తాయని చిరంజీవి యువత జనసేన నాయకుడు క్రాంతికుమార్ అన్నారు. వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ మంజునాథను సన్మానించారు. జనసేన నాయకులు ఖాజాఉశేన్, రామకృష్ణ, సత్యంరెడ్డి, మధు రామాంజినేయులు,వహాలాలి పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో వ్యక్తిత్వ వికాసం



మాట్లాడుతున్న మల్లికార్జున

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతో వ్యక్తిత్వ వికాసం, విజ్ఞానం, నైపుణ్యాలను పెంచుకోవచ్చని తెలుగు ఉపాధ్యాయుడు మల్లికార్జున, గ్రంథాలయ అధికారి సుజాత అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో ఆదివారం నాలుగోరోజు రాజు కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. విద్య దోచుకునేది కాదని జ్ఞానం పెంచుకోడానికి గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కనకదాసు జయంతి పట్ల హర్షం



మాట్లాడుతున్న కురవ సంఘం నాయకుడు హనుమప్ప

ఆలూరు రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): భక్త కనకదాసు జయంతిని ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించడం నాయకులు ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. మాదారి కురువలకు ఎస్సీ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని భక్త కనకదాసు కమ్యూనిటీ భవనాలు మంజూరు చేయాలని కోరారు. ఈనెల 18న భక్త కనకదాసు జయంతిని నిర్వహించేందుకు ఏర్పాటు చేశామని చెప్పారు. సీఎం చంద్రబాబు, మంత్రి సవితకు కృతజ్ఞతలు తెలిపారు. మాదాసి మాదారి కురువ సంఘం తాలూకా నాయకులు బెలగంటి హనుమప్ప, కురవ రామాంజినేయులు, మాజీ ఎంపీటీసీ మారెప్ప, లక్ష్మిరెడ్డి బెవిన ఈరన్న వెంకటేష్, మాణిక్య రెడ్డి, సంతోష్, కిషోర్, చంద్ర పాల్గొన్నారు.

కరిగించేస్తున్నారు

- కొండాపురం కొండలను తవ్వేస్తున్న అక్రమార్కులు
- కూటమి నాయకులు కావడంతో చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు
- కనుమరుగవుతున్న గ్రావెల్



ఇష్టారాజ్యంగా తవ్వేయడంతో ఆనవాళ్లు కోల్పోతున్న కొండ



సబ్‌కలెక్టర్ ఆఫీస్ వద్ద గ్రావెల్ ట్రాక్టర్

ఆదోని, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపురం కొండలు కరుగుతున్నాయి. గత వైసీపీ పాలనలో ఇప్పటికే కొండలు ఉనికి కోల్పోయాయి. అయితే తామేమీ తక్కువ తిన్నామా అన్నట్లు కూటమి ప్రభుత్వం టీడీపీ కన్ను కొండపై పడింది. ఇంకేముంది రోజూ కొండను తవ్వి, గ్రావెల్‌ను భారీ వాహనాల్లో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

ట్రాక్టర్లు, టిప్పర్లలో తరలింపు

కొండను తవ్వి గ్రావెల్ ట్రాక్టర్లు, టిప్పర్లలో నింపి తరలించేస్తున్నారు. పట్టణంలోని పరిశ్రమలకు తరలించి సొమ్ము చేసుకుం టున్నారు. ప్రభుత్వానికి రూ.లక్షల్లో చెల్లించాల్సిన పన్నులను ఎగ్గొడుతున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ పోలీస్ అధికా రులు పట్టించుకున్న పాపాన పోలేదు. గతంలో ఉన్న రెవెన్యూ శాఖ అధికారులు తూతూ మంత్రంగా దాడులు జరిపి మమ అనిపించేశారు.

నెలవారి మామూళ్లు

అక్రమార్కుల నుంచి పోలీసులు, రెవెన్యూ అధికారులకు నెలవారి మామూళ్లు అందుతున్నట్లు ఆరోపణలున్నాయి. అందుకే వారు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని చర్చ సాగుతోంది.

ఎవరినీ ఉపేక్షించం



కొండాపురం కొండలను పరిశీ లిస్తాం. అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించం, కేసు నమోదు చేస్తాం.
-శివరాముడు, తహసీల్దార్, ఆదోని.

ప్రమాదకర మలుపులు

● నిత్యం రోడ్డు ప్రమాదాలు

● స్పీడ్ బ్రేక్‌లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి

గోనెగండ్ల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రధాన రహదారిలో ఉన్న మలుపుల దగ్గర నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. గత సోమవారం రాత్రి వేముగోడు సమీపంలో ఉన్న మలుపు జరిగిన రోడ్డు ప్రమాదంలో మహేష్ అనే వ్యక్తి మృతి చెందాడు. ఆదివారం గోనెగండ్ల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకటేష్ అనే వ్యక్తి మృతి చెందాడు. గత


చదువులరామయ్య కాలనీ దగ్గర రెండు బస్సులు డీ కొన్న దృశ్యం (ఫైల్)

శనివారం గాజులదిన్నె ప్రాజెక్టు దగ్గర క్రాస్‌రోడ్డును ద్విచక్రవాహనం దాటుతుండగా ఎమ్మిగనూరు వైపు నుంచి ఆర్‌టీసీ బస్సు ద్విచక్రవాహనం ఢీకొన్నడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే గత వారం రోజుల క్రితం మంత్రాలయం రోడ్డు లోని హలహర్వి దగ్గర ముగ్గురు, ఆదివారం రాత్రి ధర్మాపురు దగ్గర ముగ్గురు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఇలా ప్రతి రోజు రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. గత కొన్నేళ్లుగా మలుపుల దగ్గర సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకులు లేక పోవడంతో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ లాంటి సంఘటనలు ఈప్రాంతంలో నిత్యకృతంగా మారాయి. ఈ ప్రాంతంలో స్పీడ్ బ్రేక్‌లు, హెచ్చరిక సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే మండల కేంద్రమైన గోనెగండ్లలోని వీవర్స్ కాలనీ దగ్గర ఉన్న మలుపులు, చదువుల రామయ్య కాలనీ, గంజహళ్లి క్రాస్ రోడ్ద దగ్గర ఉన్న మలుపులు కూడా ప్రమాదకరంగా ఉన్నాయి. అలాగే గాజులదిన్నె ప్రాజెక్టు క్రాస్‌రోడ్డు దగ్గర ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి మలుపుల వద్ద ప్రమాదకర బోర్డులను స్పీడ్ బ్రేక్‌లను వేయాలని ప్రమాణికులు కోరుతున్నారు.

సామర్థ్యానికి మించి వాహనాల్లో ప్రయాణం

ప్రైవేట్ వాహనాల్లో కెపాసిటీని మించి ప్రయాణికులను ఎక్కించుకొని ప్రయాణం చేయడం, మలుపుల వద్ద బండి అదుపు రాకపోవడం వల్ల


గోనెగండ్ల వీవర్స్ కాలనీ సమీపంలో ఉన్న ప్రమాదకర మలుపు

చాలా ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రైవేట్ వాహనాలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలి



ప్రమాదకర మలుపుల వద్ద ఆర్‌అండ్‌బీ అధికారులు హెచ్చరిక సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. అవసరమైన చోట స్పీడ్ బ్రేకులు వేయాలి. దీంతో రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చు. కెపాసిటికి మించి ప్రయాణికులను తరలించే వాహనాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

- రహంతుల్లా, గోనెగండ్ల

అధికారుల నిర్లక్ష్యంతోనే రైతులకు అన్యాయం

రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడ్



మాట్లాడుతున్న పంపన్నగౌడ్

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యంతోనే రైతులకు అన్యాయం జరుగుతోందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడ్ అన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ జిల్లాలో అన్ని మార్కెట్ యార్డులో పత్తి, వేరుశనగ ధరలు పూర్తి స్థాయిలో పతనమయ్యాయని ఇందుకు అధికారుల నిర్లక్ష్యమే కారణమన్నారు. అధికారుల నిర్లక్ష్యంతో వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలను నియంత్రిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వాలు, సీసీఐ కంపెనీలు రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు

గోనెగండ్ల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దనేలటూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన ఈశ్వరదేవాలయంలో గణేష్, సుబ్రహ్మణ్యేశ్వర, శివలింగం, పార్వతిదేవి, బసవేశ్వర, గోపుర కలశం, ధ్వజస్తంభం, నాగదేవతల విగ్రహాల ప్రతిష్ఠాపన పూజలు సోమవారం నుంచి ఈనెల 20వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విగ్రహాల ప్రతిష్ఠ పూజ కార్యక్రమం కల్లుహళ్లి సంస్థాన మఠం పీఠాధిపతి చన్న వీరశివాచార్య మహాస్వాములు, కోటేకళ్లు పరమేశ్వస్వామి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు వివరించారు. 18న గోపుర కలశాన్ని గ్రామ వీధుల్లో ఊరేగిస్తారు. 19న గణేశ, నవగ్రహ కలశపూజ, 20న విగ్రహాల ప్రతిష్ఠ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.


పెద్దనేలటూరులో నూతనంగా నిర్మించిన ఈశ్వర స్వామి దేవాలయం

రేపు రాష్ట్ర స్థాయి భజన పోటీలు: ఈశ్వర దేవాలయం, ఈశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకొని రాష్ట్రస్థాయి భజన పోటీలు మంగళవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు రూ. 500 ప్రవేశరుసుము చెల్లించి తమ పేరును నమోదు చేసుకోవాలన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ. 16,016, రెండవ బహుమతి రూ. 15,016, మూడవ బహుమతిగా రూ. 12,016, పది బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఉత్తమ హార్మోనిస్టు, తబలిస్టు, ఉత్తమ గాయకుడికి ప్రత్యేక బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి

మంత్రాలయం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలని ఆర్యవైశ్య యువజన జిల్లా అధ్యక్షుడు దేవకి జనార్దన్, జిల్లా న్యాయ సలహాదారుడు ఎల్కూరి గురుప్రసాదు అన్నారు. మంత్రాలయంలో ఆదివారం వారు మాట్లాడుతూ ఆర్యవైశ్య యువకులు కూడా రాజకీయాల్లో రాణించి సంఘం అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ నెల 24న అనంతపురంలో జరుగు ఆర్యవైశ్య యువజన సంఘం రాష్ట్ర కమిటీ ప్రమాణ స్వీకారం ఉంటుందన్నారు. ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీ టీజీ వెంకటేష్, మంత్రి టీజీ భరత్ హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశానికి ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొని సభను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య యుజన నాయకులు తక్కశిల బాలాజీ శెట్టి, పణిరాజు, అశ్వథ్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ అంగన్‌వాడీ కార్యకర్త మృతి

ఎమ్మిగనూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్లపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కార్యకర్త నాగవేణమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు నాగవే ణమ్మ కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతుందేది. కుటుంబ సభ్యులు చికిత్స కోసం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది.

మంత్రాలయానికి పోటెత్తిన భక్తులు

మంత్రాలయం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి దర్శనార్థం మంత్రాలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు దినం కావటంతో వేలాది భక్తులు తరలివ చ్చారు. మఠం ప్రాంగణం కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదితీరం భక్తులతో కోలాహాలంగా మారింది. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు పీఠాధిపతి ఆశీస్సులు పొందారు.

రమణీయం ప్రహ్లాదరాయల రజత రథోత్సవం

రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు రజత రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆదివారం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో అర్చకులు బృందావనానికి పూజలు నిర్వహించారు. అనంతరం ప్రహ్లాదరాయలను రజత రథంపై ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు.

శ్రీమఠం అన్నదానానికి రూ. లక్ష విరాళం

రాఘవేంద్రస్వామి మఠానికి బెంగళూరుకు చెందిన బాలదేవ్ కృష్ణమూర్తి అనే భక్తుడు రూ.లక్ష విరాళం ఇచ్చినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజరు వెంకటేష్ జ్యోషి తెలిపారు. ఆదివారం ఆయన కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. దాత కుటుంబాన్ని పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆశీర్వదించారు.


మఠం ప్రాంగణంలో రద్దీగా ఉన్న భక్తులు

ఎంపీపీ దంపతులకు పరామర్శ

కోసిగి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న కోసిగి ఎంపీపీ పి ఈరన్న, మాజీ వైస్ ఎంపీపీ నాగరత్నమ్మ దంపతులను వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మురళీమోహన్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఎంపీపీ ఈరన్న దంపతులు రెండు రోజుల క్రితం పొలం పనులు ముగించుకొని ఇంటికి వస్తుండగా బైక్ అదుపుతప్పి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డారు. ఆదోనిలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పరామర్శిన వారిలో వైసీపీ నాయకులు బెట్టన్న గౌడ్, వెంకటరామిరెడ్డి, మండమ్మ, బండ్ల గోవిందు తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ అవయవదానం చేయాలి

ఎమ్మిగనూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ అవయవ దానం చేయాలని టీడీపీ కౌన్సిలర్ దయాసాగర్ అన్నారు. ఆదివారం ఎమ్మిగనూరులో ఆయన మోహన్ ఫౌండేషన్ హైదరాబాద్ వారికి ఆయన అవయవదానం చేస్తున్నట్లు పత్రాలపై సంతరం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవయవదానం చేయడం వల్ల మరో వ్యక్తికి పునర్జన్మ ఇవ్వవచ్చన్నారు. సమాజానికి మంచి చేయాలన్న ఆలోచన ఉండాలన్నారు. త్వరలో ఓ ఫౌండేషన్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు.


అవయవదానం చేసిన టీడీపీ కౌన్సిలర్ దయాసాగర్

నారా రామ్మూర్తి మృతి టీడీపీకి తీరని లోటు

మంత్రాలయం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు మృతి టీడీపీకి తీరని లోటు అని ఆ పార్టీ నాయకుడు ఎన్.రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం మాధవరం గ్రామం లోని తన నివాసంలో నారా రామ్మూర్తి నాయుడు మృతిపట్ల సంతాపం తెలిపారు. ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మంచి నాయకుడిని కోల్పోవడం బాధాకరమని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వడ్ల విజయ్‌కుమార్, ఉరుకుందు, కేశన్న, జమీర్, చాకలి నరసింహులు, హుసేన్‌ఆలం, శివ, వీరేష్, హుసేని, అనుమంతు పాల్గొన్నారు.



మాధవరం, ఎమ్మిగనూరులో నారా రామ్మూర్తినాయుడుకు నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోదరుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు మృతి టీడీపీకి తీరని లోటు అని టీడీపీ ఎమ్మిగనూరు నాయకులు కొండయ్య చౌదరి, దయాసాగర్ అన్నారు. నారా రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రామదాస్‌గౌడు, జయన్న, మిఠాయి నరసింహులు, నరసప్ప, ఉరుకుందు, రామకృష్ణ పాల్గొన్నారు.

నందవరం: సీఎం చంద్రబాబునాయుడు సోదరుడు నారా రామ్మూర్తినాయుడు మృతి పార్టీకి తీరని లోటని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జీలు మాచాపురం కాశీంవలి, ధర్మాపురం గోపాల్, పార్టీ కన్వీనర్ డీవీ రాముడు అన్నారు. ఆదివారం రామ్మూర్తి నాయుడి చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో చిన్నకొత్తిలి సత్యారెడ్డి, మాచాపురం వెంకట్రాముడు, మాబువలి, మాజీ ఎంపీటీసీ కాలేబు, విద్యాకమిటీ మాజీ చైర్మన్ పీరసాబ్ పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యమ నిర్మాతలకు నివాళి

నందవరం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయ ఉద్యమ నిర్మాతలు అయ్యంకి వెంకటరమణయ్య, పోతురు నాగభూషణం, వెలగ వెంకటప్పయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు చిత్రపటాలకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో నందవరం లైబ్రరీయన్ శివరామ్‌ప్రసాద్, హెడ్మాస్టర్ లక్ష్మీనారాయణ నాయకులు లక్ష్మన్న, పంపన్నగౌడు పాల్గొన్నారు.


జాతీ నాయకులకు నివాళి అర్పిస్తున్న అధికారులు, నాయకులు

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికి తీయాలి


ప్రతిభ చూపిన విద్యార్థులతో గ్రంథాలయ అధికారి వసంతలక్ష్మి

మంత్రాలయం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయాలని గ్రంథాలయం అధికారి వసంతలక్ష్మి అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం సాంప్రదాయ పండుగలు, ప్రకృతి అందాలు, సహజంగా కనిపించే దృశ్యాలు అనే అంశాలపై విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిన్నారావు, రామలింగం పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకుల కార్తీక వనభోజనం


వాల్మీకి విగ్రహానికి పూలమాల వేస్తున్న వాల్మీకులు

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్థానిక గ్లోబల్ ఇండస్ స్కూల్‌లో వాల్మీకుల కార్తీక వనభోజనం ఘనంగా జరిగాయి. ఎమ్మిగనూరు వాల్మీకి వనభోజన సమితి బంగారు వెంకటేష్, కొండయ్య, నారాయణ, రంగన్న ఆధ్వర్యంలో వనభోజన కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం మహిళలు మహర్షి వాల్మీకి చిత్రపటానికి, తులసి చెట్టుకు పూజలు చేశారు. వాల్మీకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ వాల్మీకులు కలిసి కట్టుగా ఉండాలన్నారు. కార్యక్రమంలో తిరుమల నాయుడు, ఈరన్న, నరసింహులు, లక్ష్మన్న, ఉరుకుందు పాల్గొన్నారు.

ఐరన్‌బండ రోడ్డు అధ్వానం

గోనెగండ్ల, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మండలం ఐరన్‌బండ, యన్నెకండ్లకు వెళ్లే రోడ్డు రాళ్లు తెలి అధ్వానంగా మారింది. రహదారిని బాగుచేయాలని పలుమార్లు అధికారులు, నాయకుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికి ఫలితం లేకుండా పోయిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. రహదారి మొత్తం గుంతలుపడటంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.


గుంతలు పడ్డ రహదారి

సంతోష్ ట్రోఫీకి వంశీ వివేకానంద

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి ఫుట్‌బాల్ సంతోష్ ట్రోఫీకి ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన వంశీ వివేకానంద ఎంపికయ్యాడు. అనంతపుం ఆర్‌డీటీ క్యాంపస్‌లో ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సంతోష్ ట్రోఫీ నిర్వహిస్తున్నారు. ఈ నెల 13న ఈ పోటీలు అరంభమయ్యాయని తెలిపారు. ఈ రోజు జరిగిన ఫుట్‌బాల్ మ్యాచ్‌లో వంశీ వివేకానంద కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ జట్ల మధ్య జరిగిన పోటీలో ప్రతిభ కనబరచడం పట్ల ఎమ్మిగనూరు ఫుట్‌బాల్ అసోసియేషన్ వారు సంతోషం వ్యక్తం చేశారు.


వంశీ వివేకానందని అభినందిస్తున్న ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు

నడి వీధుల్లో గుర్రాలు

● ఇబ్బందుల్లో గ్రామస్థులు


గోనెగండ్లలోని ప్రధాన రహదారికి అడ్డంగా నిలిచిన గుర్రాలు

గోనెగండ్ల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోనెగండ్ల, గాజులదిన్నె, హెచ్ కైరవాడి, వేముగోడు, కులుమాల, అలువాల గ్రామాల్లో నెలరోజులుగా గుర్రాలు స్వైరవిహారం చేస్తున్నాయి. వీధుల్లో అతి వేగంగా పరిగెత్తుతూ వాహనదారులను, పాదచారులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. పలువురికి గాయాలయ్యాయి. రహదారులకు అడ్డంగా గుర్రాలు నిలిచి ఉండటం వల్ల రాకపోకలకు ఇబ్బందిగా మరిందని గ్రామస్థులు వాపోతున్నారు. అలాగే రాత్రిపూట గ్రామశివార్లలో పంట పొలాలపై పడి నాశనం చేస్తున్నాయని వాపోతున్నారు. ఆయా గ్రామ పంచా యతీ సిబ్బంది గుర్రాలను పట్టుకొని యజమానులకు అప్పగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆలయ ముఖద్వారానికి పూజలు

పెద్దకడబూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న గ్రామదేవత పెద్దలక్ష్మమ్మ దేవి ఆలయ గర్భగుడి నిర్మాణ ముఖద్వారానికి పురోహితులు శేషగిరి జోషి, అర్చకులు నరసింహచారి, కేశవచారి, ఈరన్న, పంపాపతి స్వాములు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రమాకాంత్ రెడ్డి, రామలింగారెడ్డి, రాంమోహన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, కృష్ణమూర్తి, విరుపాక్షి రెడ్డి, శివరామిరెడ్డి, నవీన్ రెడ్డి, ఎర్రన్న, జంపన్న, వీరేష్, మబ్బు ఆంజినేయులు, మల్లికార్జున, ఆంజనేయులు పాల్గొన్నారు.


ఆలయ ముఖద్వారానికి పూజలు చేస్తున్న దృశ్యం